

# నెల్లూరు తీరాన్ని విద్యుత్ వ్యాపారులకు వదిలేద్దామా? రక్షించుకుందామా?

దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుంటారనేది ఎంత నిజమో గాని రాజకీయవేత్తలు, వ్యాపారవేత్తలు కలిసి నెల్లూరు జిల్లా తీరప్రాంతాన్ని థర్మల్ పవర్ ప్లాంట్ల పేరుతో బహు తెలివిగా పంచుకుంటున్నారు. పేరున్న ప్రతి కంపెనీ మాకొక ప్రాజెక్టు, మాకొక ప్రాజెక్టు అని దరఖాస్తులు పెట్టుకుంటూ పోతోంది. అనుమతి పొందినవారు సైతం ఉత్పత్తి మొదలు పెట్టకుండానే ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతున్నారు. ఇదేం వేలంవెర్రి, ఇదేం స్వీయవిధ్వంసం, అసలిది కలా నిజమా అనుకుంటుండగానే ఆ వెర్రి వేయితలలేయడం, ఆ కలలు పీడకలలవడం మొదలైంది.




మన పాలకులకు ఎంత 'అభివృద్ధి' ఉన్మాదం పట్టకపోతే ఒక జిల్లాలోని రెండే రెండు మండలాల్లో – ముత్తుకూరు, చిల్లకూరు – ఇరవై అంటే ఇరవయ్యే కిలోమీటర్ల పరిధిలో ఒకేసారి 26 థర్మల్ పవర్ ప్లాంట్లను నెలకొల్పబోతారు! వీటికి యజమానులకయ్యే ఖర్చు (అదీ ప్రజలసొమ్మే అనుకోండి) 135 లక్షల కోట్ల రూపాయలైతే మనకయ్యే ఖర్చు, మన భూగోళానికయ్యే ఖర్చు 30 వేల ఎకరాల భూమి, రోజుకు 4 లక్షల టన్నుల బొగ్గు, 58.56 లక్షల ఘనపు మీటర్ల నీరు. వాళ్లకొచ్చేది (ఒక్కటి మినహా అన్ని ప్లాంట్లూ ప్రైవేటువే) 27 వేల మెగావాట్ల విద్యుచ్ఛక్తి అయితే మనకూ, మన భూగోళానికీ వచ్చేది రోజుకు 1.3 లక్షల టన్నుల బూడిద, 2700 టన్నుల గంధకం, ఇంకా నికిల్, కాడ్మియం, క్రోమియం వంటి కాలుష్య పదార్థాలు. మరింత స్పష్టంగా చెప్పాలంటే విపరీతమైన వాతావరణ కాలుష్యం, పంటల వినాశనం, మత్స్య సంపద నష్టం, పెద్దఎత్తున ప్రజల విస్థాపన వగైరా వగైరా.

ఈ విషయాలన్నీ నెల్లూరు జిల్లా వాసులకు తెలియనివి కావు. గత రెండు మూడేళ్ళుగా పత్రికల్లో వస్తున్న విషయాలే. అయినా సోంపేటలో లాగానో, కాకరాపల్లిలో లాగానో ఇక్కడ ఎవరూ గొంతెత్తి, రోడ్డెక్కి వీటిలో ఏ ఒక్కదాన్నీ అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. చేయడం లేదంటే అసలేం చేయడం లేదని కాదు; చేయాల్సినంత చేయడం లేదని. జరగబోయే విధ్వంసం గురించి మరింత వివరంగా తెలిస్తే జిల్లా ప్రజలు స్పందిస్తారన్న ఆశతో ఈ కరపత్రాన్ని ప్రచురించడమే కాక ఈనెల 22న చిల్లకూరు మండలంలో ప్రచారయాత్ర కూడా జరుపుతున్నాం.

**జనవరి 22న చిల్లకూరు మండలంలో జరిగే ప్రచారయాత్రను జయప్రదం చేయండి**

# అభివృద్ధి పేరిట వినాశనాన్ని వ్యతిరేకిద్దాం

మొత్తం 27,015 మెగావాట్ల సామర్థ్యంతో రానున్న ఈ 26 కేంద్రాల్లో ఇప్పటికే ఎనిమిదింటికి అనుమతులు వచ్చేసాయి. మరో 18 ప్రతిపాదన దశలో ఉన్నాయి. కృష్ణపట్నం రేవుకు ఉత్తర దక్షిణ ప్రాంతాల్లో, ప్రధానంగా తీరప్రాంతంలో ఈ పరిశ్రమలన్నీ రానున్నాయి. ఒక్క చిల్లకూరు మండలంలోనే (తమ్మినపట్నం నుండి అంకులపాటూరు లోపే) 16,955 మె.వా. సామర్థ్యంగల ప్లాంట్లను నిర్మించబోతున్నారు. ఈ 26 ప్లాంట్లలో ముత్తుకూరు మండలంలోని నేలటూరు దగ్గర వస్తున్న ఎ.పి. జెన్‌కో ప్లాంటు తప్ప మిగిలిన పాతికా లాభార్జనే ధ్యేయంగా కలిగిన ప్రయివేటు కంపెనీలవే.

ఒకే ప్రాంతంలో ఇంత భారీ సామర్థ్యంగల బొగ్గు ఆధారిత కేంద్రాలు నెలకొల్పడం దేశంలో ఇంకెక్కడా లేదు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జాంజ్‌గిర్-చంపా జిల్లాలో ఇంతకంటే ఎక్కువ సంఖ్యలోనే థర్మల్ కేంద్రాలున్నప్పటికీ, ఇంత భారీ సామర్థ్యంగల కేంద్రాలు ఒకేచోట ఉండడం మాత్రం నెల్లూరులోనే చూడబోతాం. అంతేకాదు, ఆయా ప్లాంట్లు వాటి సామర్థ్యాలను భవిష్యత్తులో పెంచుకునే అవకాశం కూడా ఉంది. మోమిడి, తమ్మినపట్నం, నేలటూరు దగ్గరున్న సింహపురి, మీనాక్షి థర్మల్ పవర్‌టెక్ ప్లాంట్లు గతంలో 540 మె.వా, 900 మె.వా, 1980 మె.వా.లకు పర్యావరణ అనుమతులు పొంది ఇప్పుడు మళ్లీ 940, 1420, 660 మె.వా.లకు అదనపు ప్రతిపాదనలను పంపి అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. అక్కడితో ఆగుతాయనీ చెప్పలేము.

ఈ థర్మల్ కేంద్రాలన్నీ అభివృద్ధి సూచికలనీ, స్థానిక ప్రజలకి మేలు చేస్తాయనీ చెప్పేవాళ్లు కొందరున్నారు కాని అవన్నీ పని జరుపుకోవడం కోసం చెప్పే ఒట్టి దొంగ మాటలు. ఈ ప్లాంట్ల ప్రభావం ఆ రెండు మండలాల్లోని ప్రజల జీవనం, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణం, నీటివనరులు, సముద్రంపై చాలా తీవ్రంగా ఉంటుందనేది నిస్సందేహం. ఈ ప్లాంట్లన్నీ గనక పని మొదలుబెడితే అది నెల్లూరుజిల్లాకే ఒక పెనువిపత్తు కాగలదు. నెల్లూరు, గూడూరు పట్టణాలు కూడా కాలుష్యాన్ని తప్పించుకోలేవు. వ్యవసాయం మీద దీని దుష్ప్రభావం వంద కి.మీ. పరిధి వరకు ఉండగలదు.

విశాఖపట్నం దగ్గరి NTPC పవర్‌ప్లాంట్ (దాని సామర్థ్యం 1000 మె.వా. మాత్రమే) సమీప గ్రామాలకు వెళితే మేం చెబుతున్నది అతిశయోక్తి కాదని అర్థం అవుతుంది. అక్కడ కాలుష్యం బారిన పడి అవిటి వాళ్లయిన వారిని చూస్తే పరిస్థితి మరింత తేటతెల్లమవుతుంది.

అయినా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ రెండూ కరెంటు పరిశ్రమలకు అడిగిందే తడవుగా 'రబ్బర్ స్టాంప్' అనుమతుల్ని ఇచ్చేస్తున్నాయి. రాష్ట్రం మొత్తంలో ఇప్పటి ఉత్పత్తి కంటే దాదాపు రెట్టింపు సామర్థ్యం కలిగిన పరిశ్రమలను కేవలం 2 మండలాల పరిధిలో నిర్మిస్తామన్నా ఏ మాత్రం తటపటాయించకుండా అనుమతులు మంజూరు చేస్తున్నాయి. దానివల్ల జరగబోయే ప్రమాదం గురించి తెలిసి కూడా ఆ పరిశ్రమలకు పచ్చజెండా ఊపుతున్నాయి. వాస్తవానికి చట్టాన్ని గనక పటిష్టంగా అమలు చేస్తే ఈ శాఖల అధికారులు అనేకమంది రాజాలా, గాలి జనార్దన రెడ్డిలా కటకటాల వెనక వుండవలసిన వారు. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని అపహాస్యం చేస్తూ తప్పుడు పర్యావరణ ప్రభావిత అంచనా నివేదికలను తయారుచేసి ప్రజల మొహాన కొడుతున్నారు. ఈ నివేదికలలో ఎక్కడా కూడా ఈ పరిశ్రమలు విడుదలచేసే కాలుష్యం మనుషులపై ఎటువంటి ప్రభావం చూపుతుందనే వివరాలు లేవు. పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని శాస్త్రీయంగా పేర్కొనలేదు. అన్ని పరిశ్రమలూ కలిసి మూకుమ్మడిగా (Cumulative) కలిగించే ప్రభావాన్ని అంచనా వేయలేదు. ఇది చాలా తీవ్రమైన లోపం.

బొగ్గు మండితే వచ్చే కాలుష్యం గాలి, నీరు, మత్స్య సంపద, వాతావరణం, వ్యవసాయం, అడవులు, వన్య ప్రాణులు, ప్రజారోగ్యం... ఒకటేమిటి అన్నిటిపైనా ప్రభావం చూపుతుంది. బొగ్గు కాలినపుడు బూడిదతోపాటు పాదరసం, నికిల్, కాడ్మియం, క్రోమియం వంటి భారలోహాలు, గంధకం కూడా విడుదలవుతాయి. భారలోహాలు కాన్సర్ కారకాలు. మొత్తం 26 ప్లాంట్లూ పని మొదలుబెడితే రోజుకి సుమారు 4 లక్షల టన్నుల బొగ్గును మండించి ప్రతిరోజూ 1.3 లక్షల

# మన నెల్లూరును కాపాడుకుందాం

## పర్యావరణ అనుమతి పొందినవి

| పేరు | సామర్థ్యం (మె.వా.) | స్థలం | మండలం |
|---|---|---|---|
| 1. దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎ.పి.జెన్‌కో) | 1600 | నేలటూరు | ముత్తుకూరు |
| 2. నెల్‌కాస్ట్ | 1320 | పైనాపురం, శివరాపురం, వరకాలిపాడు | ముత్తుకూరు |
| 3. కోస్టల్ ఆంధ్రాపవర్ లి. | 4000 | కృష్ణపట్నం | ముత్తుకూరు |
| 4. థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ | 1980 | నేలటూరు, పైనాపురం | ముత్తుకూరు |
| 5. సింహపురి ఎనర్జీ ప్రై.లి. | 540 | తమ్మినపట్నం | చిల్లకూరు |
| 6. మీనాక్షి ఎనర్జీ ప్రై.లి. | 900 | తమ్మినపట్నం, మోమిడి, నారికేళ్లపల్లి | చిల్లకూరు |
| 7. కినేట పవర్ ప్రాజెక్ట్స్ లి. | 1980 | తమ్మినపట్నం, మోమిడి | చిల్లకూరు |
| 8. కృష్ణపట్నం పవర్ కార్పొరేషన్ | 1980 | తమ్మినపట్నం, మోమిడి | చిల్లకూరు |
| మొత్తం | 14,300 | | |

## ప్రతిపాదనలో ఉన్నవి

| | | | |
|---|---|---|---|
| 1. థర్మల్ పవర్‌టెక్ కార్పొరేషన్ | 660 | నేలటూరు, పైనాపురం | ముత్తుకూరు |
| 2. లెదర్ పార్క్ | 500 | కృష్ణపట్నం | ముత్తుకూరు |
| 3. సింహపురి ఎనర్జీ ప్రై.లి. | 940 | తమ్మినపట్నం | చిల్లకూరు |
| 4. మీనాక్షీ ఎనర్జీ ప్రై.లి. | 1420 | తమ్మినపట్నం, మోమిడి, నారికేళ్లపల్లి | చిల్లకూరు |
| 5. శివస్వాతి కన్‌స్ట్రక్షన్స్ ప్రై.లి. | 1200 | మోమిడి | చిల్లకూరు |
| 6. మహావీర్ ఎనర్జీ ప్రై.లి. | 500 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 7. ప్రాగ్దిశ పవర్ ప్రై.లి. | 2640 | మోమిడి | చిల్లకూరు |
| 8. రామకృష్ణ ప్రసాద్ పవర్ ప్రై.లి. | 420 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 9. శౌర్య ఎనర్జీ ప్రై.లి. | 100 | తిరుమలమ్మపాలెం, ఏపూరు | చిల్లకూరు |
| 10. వి.ఎస్.ఆర్. పవర్‌టెక్ ప్రై.లి. | 330 | తమ్మినపట్నం | చిల్లకూరు |
| 11. వి.ఎస్.ఎఫ్. ప్రాజెక్ట్స్. లి. | 485 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 12. ఆశ్రిత పవర్ ప్రై.లి. | 200 | ఏరూరు | చిల్లకూరు |
| 13. బాలాజీ పవర్ అండ్ సోలార్ ఎనర్జీ ప్రై.లి. | 100 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 14. వి.ఎస్.ఆర్.పి. పవర్‌టెక్ ప్రై.లి. | 300 | తమ్మినపట్నం, మోమిడి | చిల్లకూరు |
| 15. ఎస్.ఎస్.ఎల్. ఆంధ్ర పవర్ ప్రై.లి. | 1320 | మోమిడి, ఏరూరు | చిల్లకూరు |
| 16. గూడూరు థర్మల్ ప్లాంట్ | 300 | అంకులపాటూరు | చిల్లకూరు |
| 17. లాంకో | 1000 | మోమిడి | చిల్లకూరు |
| 18. ఎస్.బి.క్యూ స్టీల్. లి. | 300 | అంకులపాటూరు | చిల్లకూరు |
| మొత్తం | 12,715 | | |

## ప్రచార యాత్ర

**జనవరి 22 ఉదయం 9 గంటలకు – చిల్లకూరు మండలం గుమ్మలదిబ్బలో మొదలై తమ్మినపట్నం, తమ్మినపట్నం దళితవాడ, లింగవరం, వరగలి, మోమిడి, ఏరూరు, చింతవరం, రామారెడ్డి పాలెం, అకులపాటూరు మీదుగా సాగి తిక్కవరంలో ముగుస్తుంది.**

టన్నుల బూడిద (ఫ్లై యాష్)నీ, 2700 టన్నుల గంధకాన్నీ పరిసరాల్లోకి విడుదల చేస్తాయి. ఇంతటి విధ్వంసాన్ని తట్టుకునే శక్తి ప్రకృతికుందా?

అంతేకాదు ఈ ప్లాంట్లు నడవడానికి చాలా భారీ పరిమాణంలో నీళ్ల అవసరం. అన్ని ప్లాంట్లకు కలిపి రోజుకు 58.56 లక్షల ఘనపుమీటర్ల నీరు కావలసి వుంటుంది. ఈ నీటిని సముద్రం నుండే కాక కండలేరు నది నుండి కూడా తీసుకుంటారు. మీనాక్షి, సింహపురి ఫ్యాక్టరీలేకాదు, చిల్లకూరు మండలంలో ప్రతిపాదిత ప్లాంట్లు కూడా నీటికోసం కండలేరుపై పడే అవకాశం వుంది. వ్యర్థజలాలను ఫ్యాక్టరీల నుంచి మళ్లీ సముద్రంలోకి, కండలేరులోకే వదులుతారు. ఆ నీరు సాధారణ నీటి కంటే 5-10 సెంటిగ్రేడ్ డిగ్రీల అధిక ఉష్ణోగ్రత కలిగి వుంటుంది. దీనివల్ల ఈ ప్రాంతంలో సముద్రం, కండలేరు నిరంతర కల్లోలానికి గురవుతాయి. చేపలూ రొయ్యలూ ఇతర జలజీవాల పునరుత్పత్తి బాగా దెబ్బతింటుంది.

సముద్రంపై ఆధారపడే పట్టపోళ్లు మాత్రమేగాదు ఇతర కులస్తులు కూడా నష్టపోతారు. చిల్లకూరు మండలంలోని వరగలి, మోమిడి, లింగవరం తదితర గ్రామాలలో దళిత మహిళలు కండలేరులో రొయ్యలూ చేపలూ పడతారు. 'కరువు కాలంలో కూడా ఆదుకుంటుంది మా కండలేరు' అంటారు. రాబోయే కాలంలో దాన్నంతా కోల్పోయే ప్రమాదం వుంది. ఒకవేళ వేట నడిచినా చేతికి వచ్చేది చాలా తక్కువ. ఇప్పటికే ముత్తుకూరు మండలంలోని పైనాపురం, నేలటూరు ప్రాంతంలో ఈ పరిస్థితి ఉంది. దేవరదిబ్బకు చెందిన యానాదులు బకింగ్‌హామ్ కెనాల్‌లో వేట బాగా పడిపోయిందని వాపోతున్నారు. రేపు కండలేరు పరిస్థితి కూడా అదే అవుతుంది.

థర్మల్ ప్లాంట్లలో ఉద్యోగాలు కల్పిస్తామని కొంతమంది స్థానిక పెద్దలు, కంపెనీల బ్రోకర్లు, నాయకులు చెబుతున్న మాటలు వట్టి అబద్ధాలని ఇప్పటికే ఈ ప్రాంతంలో ప్రజలకు కొంత అర్థం అయ్యింది. నిర్మాణం జరుగుతున్న దశలో కొంత కూలి దొరుకుతుంది, కొందరు కుర్రాళ్లకు ఆఫీసు బాయ్ పనులు దొరుకుతాయి గానీ ఇవన్నీ తాత్కాలికమే. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే ఈ ప్రాజెక్టుల్లో ఉండేవే పిడికెడు ఉద్యోగాలు. అవి కూడా పెద్ద చదువులు చదివిన వారికే తప్ప స్థానికులకు అందుబాటులో వుండవు.

రాబోయే కాలంలో చిల్లకూరు, ముత్తుకూరు మండలాల్లో ఊళ్లూ, పొలాలూ కనపడవు. పొగగొట్టాలూ, బూడిదకుప్పలూ, నిస్సారమైన భూములూ, నాశనమైన నీటివనరులూ, అనారోగ్యంతో మూలుగుతున్న ప్రజలూ మాత్రమే ఉండబోతారు. చిన్న రైతుల, దళితుల, యానాదుల, పట్టపోళ్ల, రైతుకూలీల జీవితాలు పూర్తిగా ఛిద్రమవుతాయి. అందరూ మూటాముల్లె పట్టుకుని వలస పోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

అందుకే ప్రగతి పేరుతో జరుగుతున్న ఈ విధ్వంసాన్ని ఆపమని పాలకులకు చెబుదాం. ప్రజల బతుకుల కంటే ప్రయివేటు కంపెనీల లాభాలు ముఖ్యం కాదని నినదిద్దాం. తప్పుడు సమాచారంతో పొందిన 8 థర్మల్ ప్లాంట్ల అనుమతులను రద్దు చేయాలనీ, ప్రతిపాదనలో వున్న 18 ప్లాంట్లను అనుమతించరాదనీ డిమాండ్ చేద్దాం. మన భవిష్యత్తును కాపాడుకుందాం.

మానవహక్కుల వేదిక
Human Rights Forum (HRF)

20-1-2012

ప్రచురణకర్తలు : ఎస్. జీవన్ కుమార్ – 9848986286, డా. ఎ. సుబ్రహ్మణ్యం – 9440275015